క్లుప్తంగా

నేడు 'భూ భారతి'పై అవగాహన సదస్సు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో నేడు(శనివారం) మధ్యాహ్నం 12 గంటలకు భూ భారతి చట్టంపై అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జగదీశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిధిలోని ప్రజలు, రైతులు, నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

దుప్పట్ల పంపిణీ



గోవిందరావుపేట: మండలంలోని దేవునిగుట్ట గొత్తికోయ గిరిజనులకు పస్రా ఎస్సై అచ్చ కమలాకర్ దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారికి సహకరించడం, ఆశ్రయం కల్పించడం చట్టరీత్యా నేరమన్నారు. గూడెంలోకి అనుమానాస్పదంగా కొత్త వ్యక్తులు సంచరించినట్లయితే తమకు సమాచారం అందించాలని అన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, వారికి తగిన పారితోషికం అందిస్తామని అన్నారు.

కమిటీ ఎన్నిక



ఇషాక్, అధ్యక్షుడు

మంగపేట: మండలంలోని రాజుపేట జామియా మజీద్ కమిటీని శుక్రవారం ముస్లింలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇషాక్, ఉపాధ్యక్షుడిగా ఎండి అబ్దుల్, సెక్రటరీగా షేక్ అక్బర్, కోశాధికారిగా ఎండీ కౌసర్, జాయింట్ సెక్రటరిగా ఎస్‌డీ ఉమ్మర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కూలిన చెట్ల తొలగింపు

ఏటూరునాగారం: ఇటీవల వర్షాలకు రహదారి వెంట కూలిన చెట్లను తొలగించినట్లు అటవీశాఖ రేంజ్ అధికారి అబ్దుల్ రెహమాన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని చిన్న బోయినపల్లి 163 జాతీయ రహదారి వెంట పడిపోయి ఉన్న చెట్లను తొలగించి చేసి ప్రయాణికుల ఇబ్బందులు తొలగించారు.

దాతలకు సన్మానం



ములుగు రూరల్: మండలంలోని రాయినిగూడెంలో పోచమ్మ గుడికి గ్రామానికి చెందిన గూడెల్లి కేతారాణి–ఒడేలు దపంతులు పెన్సింగ్, గేటు ఏర్పాటు చేయించారు. దీంతో వారిని శుక్రవారం బొడ్రాయి పండుగ సందర్భంగా గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవేందర్‌రావు, రాజు, వెంకటేశ్వర్లు, స్వామి, నారాయణ, సమ్మయ్య పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం

గోవిందరావుపేట: మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ కిరాణం షాపులో ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలను పస్రా ఎస్సై కమలాకర్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. సీసీ కెమెరాలు నేర నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. షాపులో కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం చాలా అభినందనీయం అని అన్నారు. మండలంలో సీసీ కెమెరాల ఏర్పాటులో ప్రజలు, వ్యాపారస్తులు సహకరించాలని అన్నారు.

సంతాప సభ

ములుగు రూరల్: పీడీఎస్‌యూ నాయకుడు వైనాల రవి ఇటీవల మృతి చెందగా శుక్రవారం బండారుపల్లిలో సంతాప సభ నిర్వహించారు. ఈ మేరకు పూర్వ పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ముంజాల భిక్షపతి ఆధ్వర్యంలో రవి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లక్ష్మణ్, రాజయ్య, దొనికల లలితక్క, చంద్రగిరి శంకరన్న, , మహేందర్, రాజేందర్, స్వరూప, నాగమణి, వెంకన్న పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు



ఓడవాడలో పైపులైన్ రిపేరు చేయిస్తున్న డీఈఈ సతీష్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి

- తాగునీటి కోసం వేసవిలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
- అద్దె మోటార్లు, ట్యాంకులను ఏర్పాటు చేస్తున్న అధికారులు

ఏటూరునాగారం: వేసవికాలం కావడంతో ప్రజలు దహార్తికి ఇబ్బంది పడుతుంటారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం తాగునీటి సమస్య రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లను ముమ్మరం చేసింది. గొత్తికోయగూడేలతోపాటు మారుమూల ప్రాంతాల్లోని ప్రజలకు నీటిని అందించడానికి ప్రత్యేక ట్యాంక్‌లను ఏర్పాటు చేస్తోంది. అంతే కాకుండా మిషన్ భగీరథ పైపులైన్ ద్వారా నీరు సరఫరా కానీ ఇళ్లకు అద్దెమోటార్లు, అద్దె బావులను లీజ్‌కు తీసుకొని వాటి ద్వారా అందిస్తోంది. మండలంలోని రాంనగర్ పంచాయతీ పరిధిలో పప్కాపురం కొమురం భీం నగర్‌లో వెయ్యి లీటర్ల వాటర్ ట్యాంక్‌ను ఏర్పాటు చేసి నీటిని పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అందిస్తున్నారు. అలాగే ఏటూరునాగారం ఓడవాడలో, ఎస్సీ కాలనీలో పంచాయతీ కార్యదర్శి రమాదేవి, డీఈఈ సతీష్ నేతృత్వంలో మోటార్లను అద్దెకు తీసుకొని పైపులైన్ ద్వారా సమకూర్చారు. ఇలా మండలంలోని గ్రామాల్లో నీటి ఎద్దడి ఉందని ప్రజల నుంచి ఫిర్యాదు అందడంతో వెంటనే ఉన్నతాధికారుల ఆదేశాలతో పంచాయతీ కార్యదర్శులు అప్రమత్తం అవుతున్నారు.



దళితవాడలో ఏర్పాటు చేసిన అద్దె మోటారు

తాగు నీటి సరఫరా పరిశీలన



వాజేడు: మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామ పంచాయతీలోని తిమ్మిరిగూడెంలో శుక్రవారం తాగునీటి సరఫరాను ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు పరిశీలించారు. తిమ్మిరిగూడెం గ్రామంలో ఐదు కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఈ గ్రామానికి బోరు, పైపు లైన్ ఉన్నప్పటికీ త్రీ పేజ్ విద్యుత్ లేని కారణంగా తాగు నీటిని ట్యాంకర్ ద్వారా అందిస్తున్నారు. ఉదయం, సాయంత్రం రెండు పూటలా నీటిని అందిస్తున్నట్లు ఎంపీఓ తెలిపారు. త్రీ ఫేజ్ విద్యుత్ లైన్ పనులు కొనసాగుతున్నాయని త్వరలోనే బోరు ద్వారా తాగు నీటిని అందిస్తామని పేర్కొన్నారు.



కొమురంభీం నగర్‌లో ఏర్పాటు చేసిన ట్యాంక్

నీటి సమస్య తీర్చారు



ఓడవాడలో తాగునీటి సమస్య ఏర్పడింది. విషయం అధికారులకు తెలుపడంతో వెంటనే స్పందించి అద్దె మోటార్లను తీసుకొని నీటిని సరఫరా చేస్తున్నారు. దీంతో ప్రస్తుతం నీటి సమస్య లేదు.

– సాంబశివరావు, ఏటూరునాగారం

సమస్య పరిష్కారం



ఎస్సీ కాలనీలో నీరు రాక పోవడంతో మోటార్లను లీజుకు తీసుకొని నీటిని అందించేలా అధికారులు ఏర్పాట్లు చేసి సమస్య పరిష్కారించారు. నీటి సమస్య రాకుండా తగిన ఏర్పాట్లు చేశారు.

– వెంకటస్వామి, ఏటూరునాగారం

నీటిని వృథా చేయొద్దు

వేసవిలో నీటిని వృథా చేయొద్దు. అవసరానికి అనుగుణంగా వినియోగించుకోవాలి. తాగు నీటి కోసం ఎక్కడ కూడా ఇబ్బంది లేకుండా మరమ్మతులు చేపట్టాం. నీరు రాకపోతే సమాచారం ఇవ్వండి.

– రమాదేవి, పంచాయతీ కార్యదర్శి, ఏటూరునాగారం

పహల్గాం మృతులకు ఘన నివాళి



గోవిందరావుపేట: నివాళులర్పిస్తున్న బెటాలియన్ సిబ్బంది



ఏటూరునాగారం: ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు



మంగపేటలో..

గోవిందరావుపేట: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాం వద్ద జరిగిన ఉగ్రదాడిలో అమరులైన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ శుక్రవారం చల్వాయిలోని 5వ తెలంగాణ స్పెషల్ పోలీస్ బెటాలియన్‌లో ఇన్‌చార్జ్ కమాండెంట్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సిబ్బంది నివాళులర్పించారు. బెటాలియన్‌లోని కార్యాలయాలు, విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది అందరూ కలిసి ఉగ్రవాదుల దాడిలో అమరులైన వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ వేణుగోపాల్ రెడ్డి, ఆర్ఐలు శోభన్ బాబు, కార్తీక్, శ్రీనివాస్‌లు, సాల్మన్ రాజు, రాంప్రసాద్ ఆర్ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏటూరునాగారం: కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడిలో మృతి చెందిన పర్యాటకుల ఆత్మ శాంతించాలని శుక్రవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు ఘనంగా నివాళులర్పించారు. మండల అధ్యక్షుడు రఘు పాల్గొన్నారు.

ముస్లింల శాంతిర్యాలీ

కశ్మీర్‌లో ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ జామ మసీదు ఉపాధ్యక్షుడు అజ్మత్‌ఖాన్ అన్నారు. మండల కేంద్రంలోని మసీదు నుంచి బస్టాండ్ వరకు శుక్రవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అజ్మత్ ఖాన్ మాట్లాడుతూ.. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలన్నారు. కాంగ్రెస్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు అయూబ్, సలీం, రజాక్, సాధిక్, బాబా, సిరాజ్, తాజ్, రిజ్వాన్, బాబా, రెహమాన్, యాకూబ్‌పాషా, అబ్బు, ముస్తాఫా, మునీర్ పాల్గొన్నారు.

మంగపేట: జమ్ముకాశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రమూకల దాడిని నిరసిస్తు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్ నుంచి బొడ్రాయి సెంటర్ వరకు మృతి చెందిన పర్యటకుల ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీసెల్ మండల అధ్యక్షుడు చాద మల్లయ్య, సయ్యద్ హుస్సేన్, మహబూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ఏటూరునాగారం: ఏటూరునాగారం–తాడ్వాయి మధ్యలోని 163 జాతీయ రహదారిపై కారు చెట్టుకు ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడిన ఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. హైదరాబాద్‌కు చెందిన ఫొటోగ్రాఫర్లు యశ్వంత్, చంద్రశేఖర్ కారులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్లలోని వివాహ వేడుకల్లో ఫొటోలు, వీడియో కోసం వెళ్తుండగా చిన్నబోయినపల్లి–తాడ్వాయి మధ్యలో రోడ్డు సైడ్‌బరమ్స్ సరిగా లేక కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. దీంతో కారులోని ఇద్దరికి కాళ్లు, చేతులు విరిగిపోగా పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్‌కు 108లో తరలించారు. రహదారిపై గుంతలు ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని క్షతగాత్రుల కుటుంబాలు ఆరోపిస్తున్నారు.

వాజ్‌పేయి సేవలు మరువలేనివి

- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు మోహన్‌రావు



మాట్లాడుతున్న మోహన్‌రావు

ములుగు రూరల్: అటల్ బిహారీ వాజ్‌పేయి దేశానికి చేసిన సేవలు మరువలేనివని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు గరికపాటి మోహన్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి ఉత్సవాల ముగింపు, అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు, వక్ఫ్ చట్ట సవరణ–2025 జిల్లా సదస్సును శుక్రవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు బలరాం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వాజ్‌పేయి అయోధ్యలో బాబ్రీ మసీదు పునాదులు తవ్వించి రామ జన్మభూమికి పునాదులు వేయించాడని తెలిపారు. ఇ ఈ కార్యక్రమంలో నాయకులు కల్యాణ్, శ్రీనివాస్, అజ్మీర కృష్ణవేణి, భాస్కర్‌రెడ్డి, జవహర్‌లాల్, సురేందర్, కృష్ణాకర్, రాజ్‌కుమార్, ఇమ్మడి రాకేష్, రవీంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు

ములుగు రూరల్: మండలంలోని అబ్బాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2002–03 విద్యా సంవత్సరం పదో తరగతి చదువుకున్న విద్యార్థులు శుక్రవారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. చదువు నేర్పిన గురువులను సన్మానించారు. ఉపాధ్యాయులు వీరయ్య, జనార్ధన్, సంపత్, రామకృష్ణ, సంధ్య, పర్వీన్, రాజ్ కుమార్, విద్యార్థులు విజయ్, కిషన్, అరుణ, సనీత, సుమలత, కవిత, శిరీష పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

ఏటూరునాగారం: వేసవికాలంలో గొత్తికోయగిరిజనులు జాగ్రత్తలు పాటించాలని కొండాయి వైద్యాధికారి హెచ్ ప్రణీత్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని గొత్తికోయగూడెంలో ప్రజలతో ఆయన మాట్లాడారు. వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎండాకాలంలో వడదెబ్బ తగలకుండా ముందస్తుగా తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరించారు. గొత్తికొయ్యగూడెంలో ఉన్న గర్భిణులకు, బాలింతలకు పరీక్షలు నిర్వహించి మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. డ్రై డే ఫ్రైడే కార్యక్రమం సందర్భంగా దోమలు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్



మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర, పక్కన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్

వెంకటాపురం(కె): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పాత్రాపురం గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ దివాకరతో కలిసి హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎంతో మంది మేధావులు, రాజకీయ నాయకులు, రైతు సంఘాల నాయకులు, అధికారులతో చర్చించి మెరుగైన భూభారతి ఆర్ఓఆర్ చట్టం రూపొందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారని అన్నారు. అనంతరం కలెక్టర్ దివాకర మాట్లాడుతూ.. కొత్త చట్టం వల్ల రైతులకు, ప్రజకు చేకూరే ప్రయోజనాలను, చట్టంలో పొందుపరిచిన కీలక అంశాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం మండలంలోని 15 మంది లబ్ధిదారుకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. మండల ప్రత్యేక అధికారి అప్పల నాయుడు, తాహసీల్దార్ మిరాజయ్య, మండల వ్యవసాయ అధికారి నవీన్ ఉన్నారు.

పరామర్శ

ఇటీవల హత్యకు గురైన చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాశ్ కుటుంబ సభ్యులను శుక్రవారం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ పరామర్శించారు. ఈ సందర్భంగా సాయిప్రకాశ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహన్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ హుస్సేన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిడెం శివ తదితరులు ఉన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

వాజేడు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 33 లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ హాజరై లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు యగ్గడి అంజయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ విజయ, ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు, కాంగ్రెస్ భద్రాచలం నియోజకవర్గ సీనియర్ నాయకుడు విశ్వనాథ ప్రసాదరాజు, ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి విక్రాంత్ తదితరులు ఉన్నారు.

మలేరియాను నిర్మూలిద్దాం..

మలేరియా మహమ్మారిని నిర్మూలిద్దామని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ అన్నారు. ప్రపంచ మలేరియా నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో శుక్రవారం వాజేడు, పేరూరు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వైద్యులు మహేందర్, మధుకర్, వేణుగోపాల కృష్ణ, కోటి రెడ్డి, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు షాపులు కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మంగపేట: మండలంలోని మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహాస్వామి దేవస్థానంలో నిర్వహించే దుకాణాలు అన్నింటిని స్థానిక ఆదివాసీ గిరిజనులకు కేటాయించాలని పెసా కోఆర్డినేటర్ తాటి విజయ్‌బాబు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు మారబోయిన గోవర్ధన్ కోరారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చీమలపాటి మహేందర్‌జీకి శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. పెసా నిబంధనల మేరకు 1/70, 1/59, ఆర్ఓఆర్, సీఎఫ్ఆర్ చట్టాల నిబంధనల ప్రకారం మల్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీ హేమాచల లక్ష్మీనర్సింహాస్వామి దేవాలయం వద్ద నిర్వహించే దుకాణాలు, షాపులను స్థానిక ఆదివాసీ గిరిజనులకు కేటాయించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆలయంలో పనిచేసేందుకు సిబ్బందిగా స్థానిక ఆదివాసీలను నియమించాలన్నారు. తోలెం నర్సింహారావు, ఆనందరావు తదితరులు ఉన్నారు.

సభను విజయవంతం చేయాలి



వెంకటాపురం(ఎం): పాదయాత్రలో నాయకులు



కన్నాయిగూడెం: పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

వెంకటాపురం(ఎం): ఎల్కతుర్తిలో ఈనెల 27న నిర్వహించే రజతోత్సవ సభను విజయవంతం చేయాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు మండల కేంద్రం నుంచి ములుగు వరకు పాదయాత్ర చేపట్టారు. మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి హాజరై పాదయాత్రకు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ రుద్రమదేవి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు లింగాల రమణారెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ నాయకులు పోరిక హర్జినాయక్, కాసర్ల కుమార్, జాహీర్‌పాషా, నర్రా భద్రయ్య, నూనె రమేష్, మహేందర్, గట్టు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోవిందరావుపేట: బీఆర్ఎస్ రజతోత్సవ భారీ బహిరంగ సభకు పల్లె పల్లెన ప్రజానీకం కదలిరావాలని బీఆర్ఎస్ గోవిందరావుపేట మండల అధ్యక్షుడు లకావత్ నరసింహ నాయక్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో గత వారం రోజులుగా జన సమీకరణపై ఆయా గ్రామ కార్యకర్తలతో సమావేశాలు ఏర్పాటు చేస్తూ దిశ, నిర్దేశం చేస్తున్నారు. ఈ సందర్భంగా నరసింహ నాయక్ మాట్లాడుతూ.. ఎన్నో పోరాటాలు చేసి తెలంగాణ సాధించామని, సాధించిన తెలంగాణలో అనేక అభివృద్ధి పనులు చేపట్టి ప్రతి ఒక్కరి మనసుల్లో కేసీఆర్ గుడి కట్టుకున్నారని అన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

కన్నాయిగూడెం: వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభ వాల్ పోస్టర్‌ను మండలంలోని బుట్టాయిగూడెంలో మండల అధ్యక్షుడు సుబ్బుల సమ్మయ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కావిరి చిన్నికృష్ణ, పూజారి కిషోర్, వెంకటయ్య, సుధాకర్ నర్సింహారావు, దుర్గం రాజుకుమార్, అశోక్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నియంత్రణలో భాగస్వాములు కావాలి

- జిల్లా వైద్యాధికారి గోపాల్‌రావు



ములుగు: జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ గోపాల్‌రావు



ఏటూరునాగారం: ర్యాలీ ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ క్రాంతికుమార్

ములుగు: మలేరియా వ్యాధి నియంత్రణలో ప్రజలు భాగస్వాములు కావాలని జిల్లా వైద్యాధికారి గోపాల్‌రావు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన శుక్రవారం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ ర్యాలీ జిల్లా ప్రధాన ఆస్పత్రి నుంచి వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం వరకు కొనసాగింది. అనంతరం రాయినిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వెంకటాపురం (ఎం) సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రతీ సంవత్సరం మలేరియా దినోత్సవం నిర్వహించి ప్రజల్లో అవగాహన పెంచుతున్నట్లు తెలిపారు. కీటక జనిత నియంత్రణాధికారి చంద్రకాంత్, డెమో సంపత్, ఏఎంఓ దుర్గారావు, సాంబయ్య, దేవమ్మ, నిర్మల, మేరి, కమల, భాస్కర్, వెంకట రెడ్డి, రాజయ్య, హరి పాల్గొన్నారు.

మురుగు గుంటలను పూడ్చివేయాలి

ఏటూరునాగారం: ఇంటి పరసర ప్రాంతాల్లో నిల్వ ఉన్న మురుగు గుంటలను పూడ్చివేయాలని ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్ఓ క్రాంతికుమార్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని సామాజిక ఆస్పత్రి నుంచి ఐటీడీఏ వరకు నిర్వహించిన ర్యాలీని క్రాంతికుమార్ ప్రారంభించి మాట్లాడారు. దోమలు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి దోమల మందు పిచికారీ చేయిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుమలత పాల్గొన్నారు.

మంగపేట: మండలంలోని చుంచుపల్లి పీహెచ్‌సీ వైద్యధికారి చిన్నపెల్లి యమున ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ శైలజ, హెచ్‌వి పద్మ పాల్గొన్నారు.

కన్నాయిగూడెం: మలేరియా నిర్మూలనలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని స్థానిక వైద్యుడు అభినవ్ అన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో డాక్టర్ అభినవ్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ తీశారు. డాక్టర్ అన్మిషా, హెల్త్ ఎడికేటర్ సుజాత, సూపర్ వైజర్ రమణ కుమారి, ల్యాబ్ టెక్నీషన్ సురేష్, హెల్త్ అసిస్టెంట్ లెమన్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

జాతరకు భక్తులు తరలిరావాలి



మొక్కులు చెల్లించుకుంటున్న నాయకులు

వెంకటాపురం(ఎం): మండలంలోని రామాంజాపూర్ సమీపంలో మే 12 నుంచి నిర్వహించే నాంచారమ్మ జాతరకు భక్తులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆదివాసీ ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు కేతిరి భిక్షపతి పిలుపునిచ్చారు. శుక్రవారం నాంచారమ్మ దేవతకు ఎరుకల సంఘం నాయకులు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ.. కాకతీయులు ఎరుకల నాంచారమ్మ ఆలయాన్ని నిర్మించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎరుకల సంఘం నాయకులు పల్లకొండ భాస్కర్, బంగారయ్య, ఎల్లస్వామి, బాబు, సురేష్, పరమేష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.